ప్రగతి మార్గం

రోడ్డు, రైలు మార్గాలకు మహర్దశ
విశాఖ నుంచి ప్రారంభోత్సవం, శంకుస్థాపన
సీఎం చంద్రబాబు చొరవ.. పీఎం మోదీ వరాలు



డబ్లింగ్ పనులు పూర్తి అయిన గుత్తి-ధర్మవరం రైలు మార్గం



డబ్లింగ్ పనులు చేపట్టే గుత్తి-పెండేకల్లు రైల్వే లైన్

గుంతకల్లు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చొరవతో అనంతలో రైల్వే, రోడ్డు మార్గాల అభివృద్ధి వేగవంతం అయింది. విశాఖ నుంచి ప్రధాని మోదీ బుధవారం వర్చువల్‌గా రాష్ట్రంలో ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనుల్లో జిల్లాలోని రహదారులు, రైల్వే లైన్లు ఉండటం విశేషం. గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని గుత్తి-పెండేకల్లు బైపాస్ లైన్ సెక్షన్‌ను రూ.350 కోట్లతో చేపట్టే డబ్లింగ్ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ మార్గం డబుల్ అయితే బెంగళూరు-విజయవాడ, బెంగళూరు-హైదరాబాదు మార్గాలలో ప్రయాణం వేగవంతం అవుతుంది. ఈ లైన్‌లలో ప్రయాణించే రైళ్ల వేగాన్ని పుంజుకుంటాయి. 2016లో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో రూ.998 కోట్లతో చేపట్టిన గుత్తి-ధర్మవరం రైల్వే లైన్ డబ్లింగ్ పనులు పూర్తి అయ్యాయి. ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. బెంగళూరు-హైదరాబాద్, హైదరాబాదు-తిరుపతి, హైదరాబాదు-విజయవాడ రైళ్ల వేగాన్ని పెంచేందుకు వీలుగా చేపట్టనున్న మహబూబ్‌నగర్-కర్నూలు-డోన్ లైన్ డబ్లింగ్ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రైల్వే డివిజన్‌లో సరుకు రవాణా, ప్రయాణికుల చేరవేత పరంగా ఎంతో పురోగతి సాధ్యపడుతుంది. రోడ్డు రవాణాకు సైతం ప్రాధాన్యం ఇచ్చారు. రూ.160 కోట్లతో అనంతపురం-తాడిపత్రి రహదారి విస్తరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ రహదారిని నాలుగు వరుసలకు విస్తరించి నిర్మిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో సైతం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. రూ.208 కోట్లతో పూర్తి చేసిన మడకశిర-శిర, రూ.536 కోట్లతో నిర్మించిన బత్తలపల్లి-ముదిగుబ్బ నాలుగు వరుసల రహదారిని ప్రారంభించారు.





అనంతపురం-తాడిపత్రి రహదారి

'నోటి దురుసు'పై అదే ప్రేమ..!

- కూటమి ప్రభుత్వంపై విమర్శలు
- గత నెల 7న మెగా పీటీఎంపై అవాకులు
- విచారణ పేరుతో డీవైఈఓ తీవ్ర జాప్యం
- ఆరా తీసిన కమిషనర్, ఆర్‌జేడీ ..?
- నేడు జిల్లాకు విద్యాశాఖమంత్రి లోకేశ్ రాక



తాటిచెర్ల పాఠశాలలో వాగ్వాదం (ఫైల్)

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం, విధానాలపై విమర్శలతో విరుచుకుపడిన వైఎస్‌ఆర్‌టీఏ నాయకుడు అశోక్‌పై విద్యాశాఖాధికారులు అదే ప్రేమ చూపుతున్నారు. గత నెల 7న ప్రభుత్వ కార్యక్రమం మెగా పీటీఎంపై అవాకులు పేలిన అశోక్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. చర్యల నుంచి తప్పించేందుకు అధికారులు యత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందు కోసమే విచారణ పేరుతో డిప్యూటీ డీఈఓ తీవ్ర జాప్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై విద్యాశాఖ కమిషనర్, ఆర్‌జేడీ సైతం ఆరా తీసినట్టు సమాచారం. గురువారం విద్యాశాఖ మంత్రి లోకేశ్ జిల్లాకు రానున్న నేపథ్యంలో దీనిపై ప్రస్తుతం ఆ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నెల కిందట జరిగితే...

కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం గత నెల 7న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించింది. స్కూళ్లలో మంచి వాతావరణం తేవడం కోసం, విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రుల్లోనూ అవగాహన కల్పించడానికి ఈ వేడుక నిర్వహించారు. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల స్కూలులో పనిచేసే టీచర్, వైఎస్‌ఆర్‌టీఏ నాయకుడు అశోక్‌కు, స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆయన విధులకు సరిగ్గా హాజరుకాకపోవడం, నాడు-నేడు పనుల్లో అవకతవకలపై అదే రోజు గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆయన మెగా పీటీఎంపై నోరుపారేసుకున్నారు. 'పేరెంట్స్‌కు అన్నం పెట్టేందుకు 10 వేలు ఇచ్చారా..? యా గవర్నమెంట్ ఇచ్చింది..? ఎంత ఇచ్చింది..? చెప్పండి..' అంటూ క్లాస్ రూంలోనే రెచ్చిపోయారు. 'ఏం చికెన్లు, పొట్టేళ్లు కోసి పెడతారా..? ఏందో అంతా ఓవరాక్షన్' చేస్తున్నారంటూ అంటూ దూసురుగా తల్లిదండ్రులు, పిల్లలపై రెచ్చిపోయారు. ఈ ఘటన జరిగి నెల గడిచినా....అధికారులు మాత్రం అదే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీనిపై వెంటనే రిపోర్ట్ ఇవ్వాలంటూ డిప్యూటీ డీఈఓను ఆదేశించినా.... ఆయన జాప్యం చేస్తూ...డిసెంబర్ చివరి వారంలో నివేదిక ఇచ్చారు. అశోక్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేలా నివేదిక ఇచ్చినట్లు విద్యాశాఖవర్గాల ద్వారా తెలుస్తోంది. కమిషనర్ విజయరామరాజు సైతం ఇటీవల ఆర్‌జేడీ శామ్యూల్‌ను ఈ అంశంపై ఆరా తీసినట్టు సమాచారం. జిల్లా విద్యాశాఖాధికారులు మాత్రం చర్యలకు అడుగు ముందుకేయడం లేదు. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతి డీఈఓ ప్రసాద్‌బాబును ప్రశ్నించగా... డిప్యూటీ డీఈఓ నుంచి నివేదిక వచ్చిందన్నారు. త్వరలో ఆ నివేదికను పరిశీలిస్తామని చెప్పుకొచ్చారు. గురువారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జిల్లాకు రానున్ననేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. మరి ఆయనపై చర్యలు తీసుకుంటారా...దాట వేస్తారో చూడాలి.

ఎప్పుడూ కరువే..!

- కేంద్ర సాయం అందేలా చూడండి
- శాశ్వత నివారణ చర్యలు చేపట్టండి
- కేంద్ర బృందానికి రైతుల వినతులు
- కరువును కళ్లకు కట్టిన ఫొటో ఎగ్జిబిషన్
- క్షేత్రస్థాయిలో పర్యటించిన కేంద్ర బృందం



మన్నీలలో ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కరువు పరిస్థితిని వివరిస్తున్న జేడీఏ ఉమా మహేశ్వరమ్మ

అనంతపురం రూరల్/రాప్తాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పంపిన ఇంటర్ మినిస్టీరియల్ టీం జిల్లాలో బుధవారం పర్యటించింది. అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలలో కేంద్ర బృందం సభ్యులు జయంతి కనోజియా, డాక్టర్ కె.పొన్నుస్వామి క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. మన్నీల సమీపంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, వివిధ శాఖల అధికారులు జిల్లాలో కరువు పరిస్థితులను కేంద్ర బృందానికి వివరించారు. దెబ్బతిన్న వేరుశనగ, పత్తి తదితర పంటలు, భూగర్భజలాల లభ్యత, ఉపాధి పనుల కల్పన, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, పశుసంపద, పశుగ్రాసం గురించి వారికి తెలియజేశారు. స్థానిక రైతులతో కేంద్ర బృందం మాట్లాడింది. వర్షాభావంతో పంటలన్నీ నష్టపోయామని, పరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు. కరువు శాశ్వత నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి కూడా రైతులు వారికి వివరించారు.



వన్నప్పతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

వన్నప్ప కష్టాలు

మన్నీల రైతు వన్నప్ప సాగు చేసిన ఆముదం పంటను పరిశీలించారు. జరిగిన నష్టం గురించి తెలుసుకున్నారు. తాను 4.36 ఎకరాల్లో ఆముదం సాగు చేశానని, ఎకరానికి రూ.12వేలు ఖర్చు చేశానని వన్నప్ప తెలిపారు. ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, 500 అడుగులకుపైగా బోరు వేయించినా నీరు పడలేదని వివరించారు. నీరు లేని కారణంగా గత ఏడాది జొన్న సాగు చేశానని, అదికూడా చేతికి అందలేని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తరువాత స్థానిక రైతులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా అధికారులు జిల్లా పరిస్థితిని వివరించారు. ఉపాధి పనుల గురించి కేంద్ర బృందం ఆరా తీసింది. ఆ తరువాత రాప్తాడుకు వెళ్లారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో కలిసి రైతు కొండప్ప సాగు చేసిన ఉలవ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంటలు సాగు, పెట్టుబడులు, నష్టపోయిన పరిస్థితిని తెలిపారు.

సాయానికి హామీ: కలెక్టర్

ఖరీఫ్‌లో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు రూ.112.05 కోట్ల సాయం అందించాలని కేంద్ర బృందాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కోరారు. భవిష్యత్తులో కరువు పరిస్థితులు ఎదురైతే జిల్లాలో ఉపాధి పనిదినాలు పెంచేలా తమ నివేదికలో ప్రతిపాదిస్తామని, గ్రామీణ, పట్టణ నీటి సరఫరా, నీటి సంరక్షణ పనులకు అధిక నిధులు కేటాయించేలా చూస్తామని కేంద్ర బృందం హామీ ఇచ్చిందని కలెక్టర్ విలేకరులకు తెలిపారు. కేంద్ర బృందం పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ కేశవనాయుడు, డ్వామా పీడీ సలీమ్ బాషా, సీపీఓ అశోక్‌కుమార్, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ రెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ రవి, అనంతపురం రూరల్ తహసీల్దారు మోహన్‌కుమార్, ఏఓ శశికళ, మన్నీల సర్పంచు త్రిలోక్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీ మినహాయించాలి..

సూక్ష్మ సేద్య పరికరాలపై 18 శాతం జీఎస్టీని విధిస్తున్నారు. కరువు నేపథ్యంలో రైతులకు ఇది భారంగా మారింది. రైతులకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలి. పది ఎకరాల భూమి ఉన్న రైతులకూ పరికరాలను సబ్సిడీతో ఇవ్వాలి. పంటలను పూర్తిగా నష్టపోయాం. పశుగ్రాసం కూడా దక్కలేదు. ఎకరాకు రూ.40 వేలు పరిహారం అందించాలి.

- డి. శ్రీనివాసులు, రైతు, బండమీదపల్లి



సేద్యానికి అనుసంధానించండి..

ఉద్యాన పంటలకు జిల్లా అనువైనది. కానీ నీటి లభ్యత తక్కువగా ఉంది. ఉన్న నీటితోనే ఉద్యాన పంటలు పండిస్తున్నాం. భూగర్భ జలాల పెరుగుదలకు చర్యలు తీసుకోవాలి. సాగునీటి కాలువలను అనుసంధానం చేయాలి. వ్యవసాయ పనులకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలి.

- ఓబిరెడ్డి, రైతు, కందుకూరు

పరిహారం ఇవ్వాలి

ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, అంతర పంటలు సాగు చేసి రైతులు పూర్తిగా నష్టపోయారు. పంటల సాగు కోసం అప్పులు చేశారు. కేంద్ర కరువు బృందం సభ్యులు ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలి. పంటలు సాగు చేసిన రైతులందరికీ నష్టపరిహారం అందించాలి.

- ఉదయ్ కుమార్ రెడ్డి, రైతు, ప్రసన్నాయపల్లి

వేరుశనగ నష్టపోయా..

జూన్‌లో 5.40 ఎకరాల్లో వేరుశనగ విత్తనం వేశాను. జూలైలో వర్షం రాలేదు. ఆగస్టులో కురవడంతో పంట కొంత వరకూ పెరిగింది. సెప్టెంబరులో పూర్తిగా వర్షం కురవలేదు. దీంతో పంట పూర్తిగా ఎండిపోయింది. పెట్టుబడి కూడా దక్కలేదు. కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- అమర్‌నాథ్ రెడ్డి, రైతు, లింగనపల్లి

అన్ని మండలాల్లో కరువు

జిల్లాలో 7 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చారు. కానీ అన్ని మండలాలలో పంట నష్టం జరిగింది. జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలి. కరువు మండలాలుగా ప్రకటించిన చోట కరువు నివారణ, సహాయక చర్యలు చేపట్టడం లేదు. ఆహార పంటలకు ఎకరానికి రూ.30 వేలు, వ్యవసాయ పంటకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి. తాగు, సాగు నీటి సమస్య లేకుండా చూడాలి.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఉద్యాన రైతులను ఆదుకోవాలి..

ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన సాధారణ రైతులతోపాటు ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు కూడా నష్టపోయారు. వారికీ నష్టపరిహారం ఇవ్వాలి. చీనీపై సూట్ ఎత్తివేయాలి. నకిలీ విత్తనాలను అరికట్టాలి. రైతులకు న్యాయం చేయాలి.

- పోతులయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు, రాప్తాడు

విన్నపాలు వినవలె..



కేంద్ర బృందం సభ్యులకు వినతి పత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, వెంకటశివుడు యాదవ్

రైతులను ఆదుకోండి: ఎమ్మెల్యే దగ్గుపాటి

వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని అన్నివిధాల ఆదుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ కేంద్ర బృందాన్ని కోరారు. వేరుశనగ సహా అన్ని పంటలు కీలక దశలో ఉన్నప్పుడు వర్షాలు కురవలేదని వారికి తెలిపారు. పంట తొలగించే సమయంలో వర్షం రావడంతో వేరుశనగ కుళ్లిపోయిందని, పశుగ్రాసం కూడా దక్కలేదని వివరించారు. రైతులను వీలైనంత సాయం అందేలా చూడాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, తెలుగుయువత రాష్ట్ర నాయకులు దండుశీనా, కురుబ నారాయణస్వామి తదితరులు కేంద్ర బృందాన్ని కలిశారు.

అన్ని విధాలా ఆదుకోండి: పరిటాల సునీత



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వర్షాలు సకాలంలో కురవకు రైతులు తీవ్రంగా నష్టపోయారని, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కేంద్ర బృందాన్ని కోరారు. వేరుశనగ పంట కీలక దశలో వర్షాలు రాలేదని, కంది పంట కీలక దశలో వర్షాలు ఎక్కువై తెగుళ్ల వ్యాపించాయని వివరించారు. ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలాల్లో కరువు ఎక్కువగా ఉందని, ఆ మండలాలను కూడా కరువు జాబితాలో చేర్చాలని కోరారు. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా రాప్తాడు, ధర్మవరం ప్రాంత చెరువులకు నీరు సక్రమంగా చేరడం లేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. డ్రిప్ పరికరాల సబ్సిడీ పరిమితిని పది ఎకరాలకు పెంచాలని కోరారు.

రైతు సంఘాల వినతులు

రైతు సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బృందానికి పలువురు వినతిపత్రాలు అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అనంతపురం రూరల్, రాప్తాడు ప్రాంతీయ కార్యదర్శి రామాంజినేయులు కేంద్ర బృందాన్ని కలిశారు. రైతులకు జరిగిన నష్టాన్ని వివరించి, సాయం అందేలా చూడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు చెన్నప్పయాదవ్, మల్లికార్జున, రామకృష్ణ, రమేష్, మన్నీల వెంకటరాముడు, నగేష్, ఓబులేసు వినతి పత్రం సమర్పించారు.



వినతి పత్రం ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు



మన్నీలలో ఆముదం పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం, కలెక్టర్ వినోద్ కుమార్, జిల్లా అధికారులు

శాశ్వత చర్యలు చేపట్టాలి



ప్రకృతి వైపరీత్యాలతో ఏటా పంట నష్టం జరుగుతోంది. మార్కెట్ లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. సాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టుల ద్వారా నీటిని అందించి రైతులను ఆదుకోవాలి. హంద్రీనీవా కాలువకు లైనింగ్ వేస్తే భూగర్భ జలాల పెరుగుదలకు ఆటంకం కలుగుతుంది. ఆ పనులను నిలిపివేయాలి. టమోటాకు గిట్టుబాటు ధర ఇవ్వాలి. ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలి. కోల్డ్ స్టోరేజ్ గోడౌన్‌లను ఏర్పాటు చేయాలి. రైతులకు డ్రిప్, స్ప్రింకర్లను 90శాతం సబ్సిడీతో ఇవ్వాలి. జిల్లాలో కరువు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి.

- మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

పంట రుణాలు మాఫీ చేయాలి



కరువును దృష్టిలో ఉంచుకుని పంట రుణాలను మాఫీ చేయాలి. కరువు నివారణకు రూ.10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి. నకిలీ విత్తనాలతో రైతులు మరింతగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ద్వారా నాణ్యమైన విత్తనాలను అందించాలి. పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలి. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

జిల్లా కేంద్రంలో కలగలిసినట్లు ఉండే మండలం బుక్కరాయసముద్రం. ఇందులోని ఓ పంచాయతీ సిద్దరాంపురం. ఈ గ్రామంలో దాదాపు ఏడు వందల ఇళ్లు ఉన్నాయి. మొత్తం జనాభా దాదాపు మూడు వేలు ఉన్నారు. ఇక్కడి ప్రజలకు పాడి, వ్యవసాయమే ప్రధానం. ప్రతి గ్రామంలో ఉన్నట్లే ఈ గ్రామంలోనే అనేక సమస్యలు ఉన్నాయి. ఈ ఊరి గురించే ఎందుకు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సి వస్తోందంటే.. ఇది శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ స్వగ్రామం. తమ ఊరి ఆడబిడ్డ తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. సొంతూరిపై మమకారంతో ఇక్కడి సమస్యలు పరిష్కరిస్తారని ఆ ఊరి ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే తండ్రి బండారు రవికుమార్ స్వగ్రామం సిద్దరాంపురం. వృత్తి రీత్య కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. తర్వాత కాలం అంటే 2014 నుంచి ఎమ్మెల్యేతో పాటు వారి కుటుంబ సభ్యులు స్వగ్రామం తో పాటు అనంతపురంలో నివసిస్తున్నారు. స్వగ్రామంలో సొంత ఇల్లు, భూమి ఉంది. ఈ నేపథ్యంలో ఆ గ్రామాన్ని 'ఆంధ్రజ్యోతి' బుధవారం సందర్శించింది. అక్కడి ప్రజలతో మాట్లాడి.. ఊరి పరిస్థితిని తెలుసుకుంది.

- ఆంధ్రజ్యోతి, బుక్కరాయసముద్రం



సిద్దరాంపురం.. సమస్యల తోరణం

- అభివృద్ధి కోసం ఎమ్మెల్యే స్వగ్రామం ఎదురుచూపు
- గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయం
- ఇళ్లు, స్థలాల కోసం పేదల నిరీక్షణ
- చెరువు నింపాలని రైతుల వినతి
- నిరుద్యోగ సమస్య తీర్చాలంటున్న యువత



ప్రాథమిక పాఠశాల ఎదుటే మురుగునీటి కాలువ



గుంతలపడిన సిద్దరాంపురం ప్రధాన రహదారి

గుంతల రోడ్డే గతి

మండలకేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది సిద్దరాంపురం. పచ్చని పైరు పంటలు, పాడితో విలసిల్లిన గ్రామం కాలగతిలో వచ్చిన మార్పులకు తలవంచింది. ఎందరో పాలకులు మారిన గ్రామస్థితిగతులు మార్చలేకపోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బుక్కరాయసముద్రం నుంచి సిద్దరాంపురం గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు గుంతలమయంగా ఉంది. గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. అనంతపురం నుంచి సిద్దరాంపురం వెళ్లడానికి గతంలో ఆర్టీసీ బస్సు ఉండేది. ప్రస్తుతం ఆ బస్సు సర్వీసు నడపడం లేదు.

స్థలాల కోసం ఎదురుచూపులు

ఎమ్మెల్యే స్వగ్రామంలో పక్కాగృహాలు, ఇంటి పట్టాలు కోసం ఎస్సీ, బీసీలు ఎదురు చూస్తున్నారు. ఇళ్ల లేకపోవడంతో చాలా మంది ఏళ్లుగా చిన్న ఇంట్లోనే 8, 9 మంది నివాసం ఉంటున్నారు. దేవుడి మాన్యం భూమిలో ఇంటి పట్టాలు ఇవ్వాలని గతంలో అధికారులుకు పలు సార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇంటి స్థలాలు కోసం, పక్కాగృహాలు కోసం గ్రామంలో దాదాపు వంద మందికిపైగా అర్హులు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి ఇంటి స్థలాలు, పక్కాగృహాలు ఇప్పించాలని కోరుతున్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయంలో పక్కాగృహాలు కావాలని 20 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రూ. 26 లక్షలతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం బండారు శ్రావణీశ్రీ తన స్వగ్రామ పంచాయతీలో రూ.26 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో మరి కొన్నిపనులకు ప్రతిపాదనలు పంపారు.

చెరువుకు నీరు నింపితే.. వ్యవసాయం మరింత మెరుగు



సిద్దరాంపురం గ్రామ చెరువును నీటితో నింపితే వ్యవసాయం రంగం మరింత పుంజుకుంటుంది. హంద్రీనీవా ద్వారా, లేదా బుక్కరాయసముద్రం చెరువు ద్వారా నీరు నింపేలా ప్రభుత్వం చొరవ చూపాలి. మా ఎమ్మెల్యేకు చెరువు నీరు విషయం తెలిపాం. ఈ విషయంపై పోరాడి చేస్తానని చెప్పారు. చెరువులోకి నీరు వస్తే గ్రామంలోని వ్యవసాయ బోర్లు, తాగునీటి బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాయి.

- సంజప్ప సిద్దరాంపురం

డెయిరీ ఏదీ..?

సిద్దరాంపురం గ్రామ పంచాయతీలో పాడిపరిశ్రమపై 150 కుటుంబాలకు పైగా ఆధార పడి జీవిస్తున్నారు. ప్రతి రోజూ వేల లీటర్లు ఈ గ్రామ పంచాయతీ నుంచి అనంతపురం తరలించి విక్రయిస్తుంటారు. ఇది చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న పని. గ్రామ పంచాయతీలోనే ప్రభుత్వం ఓ డెయిరీని ఏర్పాటు చేసి, పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పాడి రైతులు కోరుతున్నారు.

జాబ్‌మేళా నిర్వహించాలి: రాంప్రసాద్



నేను పీజీ వరకు చదివా. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కోసం ప్రయత్నించి విఫలమయ్యా. దీంతో ఉన్న ఊరిలోనే ఇంటి వద్ద గాలి మిషన్ పెట్టుకుని జీవిస్తున్నా. నా భార్య నారక్క డిగ్రీ పూర్తి చేసింది. ఇద్దరం కలిసి గాలి మిషన్ ద్వారా బతుకుతున్నాం. మాకు పక్కా ఇల్లు కూడా లేదు. ఎమ్మెల్యే గారు ఏదైనా జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ సమస్య పరిష్కారించాలి.



ఊరి కాలువ గట్టు మీద విద్యార్థుల నడక

ఇల్లు కూలిపోయింది..



2007లో ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్నా. అయితే గతంలో కురిసిన వర్షాలకు అది నేలమట్టం అయ్యింది. ఐదేళ్ల నుంచి చిన్న బాడుగ ఇంట్లో ఉంటున్నా. పక్కా ఇంటి కోసం అధికారులు చుట్టూ తిరిగినా మంజూరు చేయలేదు. చిన్న ఇంటిలోనే నా ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, మా అమ్మ, నా భార్య మొత్తం ఆరుగురు ఉంటున్నాం. చిన్న ఇంటిలో జీవనం ఇబ్బందిగా ఉంది. ఎమ్మెల్యేగారు కనికరించి నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు పక్కాగృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా.

- నారాయణస్వామి, సిద్దరాంపురం

చెరువుకు సాగునీరు... ఎమ్మెల్యేకు సవాల్

సిద్దరాంపురం గ్రామ చెరువును నీటితో నింపడం ఎమ్మెల్యేకు సవాల్‌తో కూడుకున్న పని. 2015లో ఈ చెరువును హంద్రీనీవా నీటితో నింపాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేశారు. రూ.30లక్షలతో సప్లై చానల్ పనులు కూడా చేపట్టారు. అయితే సాంకేతికపరమైన చిక్కులు రావడంతో పనిని ఆపివేశారు. ప్రస్తుతం బుక్కరాయసముద్రం చెరువు ద్వారా ఓ సప్లై చానల్ ఏర్పాటు చేసి, దాని ద్వారా సిద్దరాంపురం చెరువును నింపాలని ఆ గ్రామంలోని రైతులు గతంలో అధికారులను కోరారు. ఇందుకు రూ. 10 కోట్ల పైగా ఖర్చు అవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనాలు వేయడం జరిగింది. మరి ఇంత మొత్తం ఒక్క పంచాయతీకే రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి, చెరువును నీటితో నింపడం ఎమ్మెల్యేకు సవాల్‌తో కూడుకున్న విషయమే.

ఊరి కాలువ సమస్య

గ్రామంలో నిరుద్యోగ సమస్య, ఎస్సీ, బీసీలకు ఇంటి స్థలా లు, పక్కాగృహాలు సమస్య తీవ్రంగా ఉంది. వీటితో పాటు రైతులు అనేక సంవత్సరాల నుంచి గ్రామంలో ఉన్న చెరువుకు సాగునీరు అందిస్తుందని రైతులు ఎదురు చూపులు చూ స్తున్నారు. గతంలో వేసి న రోడ్లు, డ్రైనేజీ కాలువల సమస్య పెద్దగా లేకపోయినా, ఎస్సీకాలనీ, ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న ఊరి కాలువ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామ పంచాయతీ హాబిటేషన్ గ్రామం అయిన ఏ కొండాపురం గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. ఈ గ్రామ పంచాయతీలో దాదాపు పాడి పరిశ్రమం మీద దాదాపు 150 కుటుంబాలు పైగా ఆధార పడి జీవనం సాగిస్తున్నాయి. స్థానికంగా డెయిరీ లేకపోవడంతో ప్రతి నిత్యం పాలను అనంతపురం తెచ్చి విక్రయించాల్సిన పరిస్థితి. ఇలా ఎమ్మెల్యే స్వగ్రామంలో సమస్యలు అనేకం ఉన్నాయి. రానున్న ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యే సొంతూరి సమస్యలపై దృష్టి పెట్టి, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారు.

నిరుద్యోగ సమస్య తీవ్రం

ఎమ్మెల్యే స్వగ్రామంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో ఇంటర్, డిగ్రీ, పీజీ చేసిన యువత అనేక మంది ఖాళీగా ఉన్నారు. గ్రామంలో ఏదైనా ఫ్యాక్టరీ పెట్టడం లేదా జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

రేపటి నుంచే సంక్రాంతి సెలవులు

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని స్కూళ్లకు శుక్రవారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులు ప్రకటించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. 2024-25 అకడమిక్ క్యాలెండర్ మేరకు ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకూ స్కూళ్లకు సెలవులు ఉంటాయన్నారు. సెలవుల్లో 10వ తరగతి విద్యార్థులు యాక్షన్ ప్లాన్ మేరకు 10 నుంచి 12 తేదీ వరకూ, 16 నుంచి 19వ తేదీ వరకూ పరీక్షలకు సెల్ఫ్ ప్రిపరేషన్ కావాలని సూచించారు. 20వ తేదీ స్కూళ్లు పునఃప్రారంభమవుతాయన్నారు. మైనార్టీ విద్యాసంస్థలకు ఈనెల 11 నుంచి 15 వరకూ సెలవులు ఉంటాయని డీఈఓ పేర్కొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

గుంతకల్లు టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఎస్కే యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు బుధవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు అటానమస్ హోదా వచ్చిన తరువాత తొలిసారిగా సెమిస్టర్ పరీక్షలు డిసెంబరు 2024లో నిర్వహించారన్నారు. ఈ పరీక్షలను మొత్తం 425 మంది రాయగా 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ డీపీ మురళీకృష్ణ, డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు సురేష్‌బాబు, గోపి, కురిపాటి రాకేష్, తదితరులుపాల్గొన్నారు.

ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో... పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో బుధవారం కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్త ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 304 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 183 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఓబులేసు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

70 ధాన్యం బస్తాలు లాగిన ఒంటెద్దు



ఒంటెద్దు బండిపై ధాన్యం బస్తాలను తరలిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) కాడెద్దుల సేద్యం కనుమరుగవుతోంది. మేడిపట్టే రైతు మాయమవుతున్నాడు. ఇలాంటి తరుణంలో ఒక రైతు తన ఒంటెద్దుతో ఐదు బండ్లలోనిల్లో 70 వరి ధాన్యం బస్తాలను ఒక కిలోమీటర్ వరకు లాగించి ఔరా అనిపించాడు. ఈ సంఘటన మండలంలోని దేవగిరి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన రైతు దేవప్పగారి అంజనేయులు తన తోటి రైతులతో సరదాగా తన ఎద్దు సామర్థ్యం గురించి మాట్లాడాడు. ఈక్రమంలోనే ఒంటెద్దుతో 70 ధాన్యం బస్తాలు తరలించడానికి పూనుకున్నాడు. తను ఒంటెద్దుకు జతగా కాడిమానుకు ఒక పక్క ఉండి 70 ధాన్యం బస్తాలు వేసుకోని వచ్చారు. దీన్ని చూసేందుకు ఊరంతా వచ్చారు. ఎద్దు కూడా ఏమాత్రం అలసలేకుండా బండిలాగింది. రైతు అంజనేయులు పక్కన మరికొంత మంది ఉండి బండిని తోయించారు. రైతు చేసిన ఈ సాహసాన్ని టీడీపీ నాయకులు అప్పారావు, గ్యాస్ గోవింద అభినందించారు.

అభిమానులూ.. జాగ్రత్త

- బాలకృష్ణ ఫ్యాన్స్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి
- నేడు డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్
- హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్



ఎస్పీతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తదితరులు

అనంతపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో స్వీయ నియంత్రణ, క్రమశిక్షణగా ఉండాలని అభిమానులు, కార్యకర్తలకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. శ్రీనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో జిల్లా ఎస్పీ జగదీష్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, బాలకృష్ణ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు జగన్‌తో కలిసి బుధవారం ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీఐపీలు, ప్రజాప్రతినిధుల గ్యాలరీలు, అభిమానుల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా ఎస్పీ జగదీష్‌తో ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఆరా తీశారు. తమ అభిమాన హీరో బాలకృష్ణ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తన నియోజకవర్గంలో జరగడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరవుతారని తెలిపారు.

పటిష్ట బందోబస్తు

అనంతపురం క్రైం: నగరంలోని శ్రీనగర్‌కాలనీలో నిర్వహిస్తున్న డాకు మహారాజ్ ఈవెంట్‌కి సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి 25వేల మంది వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. పాసులున్న వారు మాత్రమే ప్రాంగణంలోకి రావాలని సూచించారు. డాకూ మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమం నిర్వహణకు సమయం దగ్గర పడుతున్నా వేదిక, ఇతర ఏర్పాట్ల విషయంలో ఇంకా చాలా పని పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 18 నుంచి 20 ఐచర్లకు సంబంధించి బారికేడ్లు తరలించాల్సి ఉందని పోలీస్‌వర్గాలు చెబుతున్నాయి. కానీ ఇప్పటి వరకు 8 నుంచి 10 వాహనాల బారికేడ్లనే తెప్పించినట్లు తెలుస్తోంది. వేదిక కాకుండా సెలబ్రిటీ గ్యాలరీ 300మందికి ఏర్పాటు చేయాల్సి ఉంది. మోస్ట్ ఇంపార్టెంట్ పర్సన్(ఎంఐపీ) విభాగంలో 4వేల మందికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇక జనరల్ గ్యాలరీ (అన్‌లిమిటెడ్)పేరుతో కుర్చీలు లేకుండా మరో విభాగం ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటికి ప్రత్యేకంగా బారికేడ్లు తప్పనిసరి. లేకపోతే పరిస్థితి ఆందోళనకరంగా ఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

నేడు జిల్లాకు మంత్రి నారా లోకేశ్ రాక



అనంతపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం జిల్లాకు రానున్నారు. రాష్ట్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నారాలోకేశ్ జిల్లాకు తొలి సారిగా వస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకత్వం భారీగా స్వాగత ఏర్పాట్లు చేస్తోంది. ఇదిలా ఉండగా.. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన హాజరవుతున్నారు. మధ్యాహ్నం 3.20 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి సాయంత్రం 4.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి నారాలోకేశ్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 6 గంటలకు అనంతపురం నగర శివారులోని శ్రీనగర్ కాలనీ సమీపంలో ముత్యాలరెడ్డి కంపౌండ్‌లో ఏర్పాటు చేసిన డాకు మహారాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ వేదికకు చేరుకుంటారు. ఆ కార్యక్రమం అనంతరం రాత్రి 9 గంటలకు అనంతపురం నుంచి కర్నూలుకు బయలుదేరి వెళతారు. ఈ నేపథ్యంలో నారా లోకేశ్ పర్యటన, ప్రీరిలీజ్ ఈవెంట్ విజయవంతం చేయడానికి జిల్లా నాయకులు శ్రమిస్తున్నారు.

ప్రైవేటుకు దీటుగా అహుడా ఎంఐజీ లే అవుట్‌లు

- అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వెంచర్లకు దీటుగా అహుడా పరిధిలో ఎన్టీఆర్ టౌన్‌షిప్ పేరుతో ఎంఐజీ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. అహుడా కార్యాలయంలో బుధవారం ఆయన అహుడా వైస్ చైర్మన్ శివ్‌నారాయణ శర్మ, అధికారులతో కలిసి కూడేరు, గుత్తి, మడకశిర ప్రాంతాల్లో వేసిన ఎంఐజీ లేఅవుట్ల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ఎంఐజీ లేఅవుట్లను అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. లేఅవుట్లలో 40 అడుగుల సీసీ రోడ్లు, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్, ఇఎల్ఎస్ఆర్‌తో నీటి సరఫరా, సీవెజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)తో భూగర్భ మురుగు కాలువ పైపులైన్లు, కరెంటు సదుపాయాలు, వర్షపు నీటి కాలువ, వీధి దీపాలు, పార్కులు వంటి అభివృద్ధి పనులతో వసతులుంటాయన్నారు. వైస్ చైర్మన్ శివ్ నారాయణ శర్మ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఆ దిశగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ మూడు లేఅవుట్లను ఏడాదిలోపు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు ఎవరైనా డబ్బు మొత్తం ఒకేసారి చెల్లిస్తే 5శాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, సెక్రటరీ గౌరీశంకర్‌రావు, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ చౌదరి, ఈఈ రేవంత్‌రెడ్డి, సర్వేయర్ శరత్‌బాబు, ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలు ప్రమీల, నాగశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైనల్లో బెంగళూరు-నర్మదావ్యాలీ

మూడో స్థానం కోసం ఏఎస్ఏ పోటీ



గుజరాత్, నర్మదావ్యాలీ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో బెంగళూరు, నర్మదావ్యాలీ జట్లు ఫైనల్‌కు చేరాయి. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ ఇన్‌స్పైర్ అండర్-17 జాతీయ స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు బుధవారం నాలుగోరోజు కొనసాగాయి. నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ జట్ల మధ్య జరిగిన పోరు డ్రాగా ముగిసింది.

ఫాల్కన్ గర్ల్స్ ఒడిశాపై కంపాసిన్ 3గోల్స్, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై పెన్నా ఏపీ 8గోల్స్, స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నైపై బెంగళూరు 2గోల్స్, ధామ్ తమిళనాడుపై అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ జట్టు 3గోల్స్, నందిఫౌండేషన్ గుజరాత్‌పై లిబర్టీ లేడీస్ తమిళనాడు జట్టు 6గోల్స్ తేడాతో విజయం సాధించాయి. పాయింట్ల పట్టిక ఆధారంగా 15పాయింట్లతో ఉన్న బెంగళూరు, 13పాయింట్లతో ఉన్న నర్మదావ్యాలీ మధ్యప్రదేశ్ జట్లు గురువారం నిర్వహించే ఫైనల్ పోరులో తలపడనున్నాయి. తరువాత స్థానంలో ఉన్న అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ 10పాయింట్లు, స్పోర్ట్స్ ప్లస్ అకాడమీ చెన్నై మధ్య తృతీయ స్థానం కోసం జరిగే పోరులో తలపడనున్నాయి.

సమస్యలకు పరిష్కారం చూపని సదస్సులు

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- ఫిర్యాదులు 6,524... పరిష్కారం 1,684
- ఆశించిన స్థాయిలో కనిపించని ఫలితం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్(ఫైల్)

అనంతపురం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యే సదస్సులకు ఫిర్యాదులు వేలల్లో వచ్చాయి. దాదాపు 33 రోజుల పాటు నిర్వహించిన సదస్సుల్లో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో సాధ్యమైనవాటికి అక్కడే పరిష్కారం చూపారు. అయితే ఆశించిన స్థాయిలో కాదు. సదస్సులు ముగిసినా వేల సంఖ్యలో సమస్యలు పెండింగ్‌లో ఉండిపోయాయి.

6,524 ఫిర్యాదులు... 1,684 పరిష్కారం

అధికారుల లెక్కల ప్రకారం డిసెంబరు 6 నుంచి జిల్లాలో రెవెన్యూ సదస్సులు మొదలు పెట్టారు. మొత్తం 503 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఇవి బుధవారంతో ముగిశాయి. అధికారులు రికార్డుల ప్రకారం మొత్తం 6,524 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో అనంతపురం డివిజన్‌లో 2,510, గుంతకలు డివిజన్‌లో 2,577, కళ్యాణదుర్గం డివిజన్‌లో 1,437 ఫిర్యాదులు అందాయి. అత్యధికంగా ఆర్ఆర్ఆర్, సరిహద్దులు, రీసర్వేలో తప్పులు, ఆన్‌లైన్‌లో భూరికార్డులు అక్రమంగా మార్పులు, భూఆక్రమణలు తదితర వాటిపై ఫిర్యాదులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. తమ భూ సమస్యలన్నీ ఈ సదస్సుల ద్వారా పరిష్కారం అవుతాయని ఆశించిన బాధితులకు నిరాశే మిగిలిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన ఫిర్యాదులలో 1,684 మాత్రమే పరిష్కరించి నట్లు అధికారులు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకోగా భూసమస్యలున్న రైతులు మాత్రం నిట్టూరుస్తున్నారు. మొత్తంమీద రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు.

న్యూస్ బాక్స్

ఇద్దరికి ఏడాది జైలు

మడకశిర టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ మడకశిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ బుధవారం తీర్పు ప్రకటించారు. మడకశిర మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామంలో 2022 సంవత్సరంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో పోలీసు విధులకు ఆటంకం కల్గించిన కేసులో ఈ శిక్ష విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ తెలిపారు. కల్లుమర్రి గ్రామానికి చెందిన ఎన్.శివప్ప, పరిగి మండలం నరసాపురం గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే ఇద్దరు వ్యక్తులు 2022 సంవత్సరంలో కల్లుమర్రి గ్రామంలో వినాయక నిమజ్జనం ఊరేగింపులో పోలీసు విధులకు ఆటంకం కల్గించారు. దీనిపై కానిస్టేబుల్ ఎస్ఎన్ సుధాకర్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నాగేంద్ర కేసు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. వాదనలు విన్న న్యాయాధికారి తీర్పు వెలువరించారు.

కోడిపందేలు, పేకాటపై కఠిన చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోడి పందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, కత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కోడి పందేలు నిర్వహించినా, నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా కోడిపందేలు, జూదంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

టమోటా కిలో రూ.12

అనంతపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని పేర్కొన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 23,190 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు మొత్తం 27 టన్నుల చీనీకాయలు వచ్చాయని వివరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి


వెంకటలక్ష్మమ్మ (ఫైల్)

ఉరవకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని షేక్షానుపల్లికి చెందిన ముత్తలూరు వెంకట లక్ష్మమ్మ అనే 104 సంవత్సరాల శతాధిక వృద్ధురాలు మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమెకు 9 మంది సంతానం. ఆమె భర్త 1986లో మృతి చెందాడు. 104 సంవత్సరాలు వయస్సులోనూ ఆమె స్వతహాగా తన పనులు తాను చేసుకొనేది. ఎన్నడూ ఆసుపత్రికి కూడా వెళ్లలేదని బంధువులు తెలిపారు. ఆమె మృతికి టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్ సంతాపం తెలిపారు.

684 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 684 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 442 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

గుంతకల్లు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటీ చెరువు గ్రామానికి చెందిన కమ్మర ఉసేన్‌పీరా (74) అనే వృద్ధుడు వారం క్రితం అదృశ్యం కా గా.. బుధవారం చెరువులో మృతదేహం లభ్యమైంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైటీ చెరువు గ్రామ సమీపంలో ఉసేన్‌పీరాకు 2.90 ఎకరాల భూమి ఉంది. అందులో మొ క్కజొన్న సాగు చేశారు. ఈనెల 2న ఉసేన్‌పీరా పొలం వద్దకు అని చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెతికారు. బుధవారం చెరువులో శవమై తేలాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రూ.100 కోట్ల ప్రాజెక్టులో భాగస్వామ్యం

- విద్యార్థులకు ఉచితంగా ఇంటర్న్‌షిప్
- జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు


మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్ హబ్ స్పోక్ ఇన్‌స్టిట్యూట్‌తో రూ.100 కోట్ల ప్రాజెక్టులో జేఎన్‌టీయూ భాగస్వామం అయిందని ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. బుధవారం జేఎన్‌టీయూ డెస్క్‌టాప్ ప్లానర్, క్యాలెండర్, టెలిఫోన్ బుక్ ఆవిష్కరణ వేడుక నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వేడుకకు వీసీ ప్రొఫెసర్ సుద్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, ఓఎస్డీ ప్రొఫెసర్ దేవన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కొత్త ఏడాది ప్రారంభంలోనే రెండు ముఖ్యమైన ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఒకటి రూ.100 కోట్ల ప్రాజెక్ట్ కాగా మరొకటి విద్యార్థులకు ఉచితంగా ఇంటర్న్‌షిప్ ఇవ్వడానికి ఐఐటీ గౌహతి, ఐబీఎం, వాగ్ధావి గ్రూప్, గవర్నమెంట్ టెక్నాలజిస్‌తో జేఐఎఫ్‌టీ ప్రోగ్రామ్ ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. అధ్యాపక, ఉద్యోగ, సిబ్బంది అందరూ ఎవరి పనిని వారు సక్రమంగా చేసుకుంటూ వెళ్తే లక్ష్యాన్ని సులువుగా అధిరోహిస్తామని తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌కు అవసరమైన ప్రక్రియలు మొత్తం నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గత సంవత్సరం సరైన ర్యాంకింగ్ దక్కలేదన్నారు. ఈ లోటును భర్తీచేసి మెరుగైన ర్యాంక్‌ను సాధించేందుకు రిజిస్ట్రార్, డైరెక్టర్లతో కలిసి శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా తరగతులు బోధించడం, ల్యాబ్‌లకు హాజరు కావడంతోపాటు పబ్లికేషన్స్, పేటెంట్స్, ప్రాజెక్ట్స్‌పై దృష్టిసారించాలని సూచించారు. వర్సిటీ ఆర్థిక భారం రాష్ట్ర ప్రభుత్వంపై లేకుండా ఉండాలంటే 'మన యూనివర్సిటీని స్వయం సుస్థిరమైనదిగా చేయడం ఎలా' అనే ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ అంశంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చర్చించి అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ క్రిష్ణయ్య మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలోని కళాశాలలు డీమ్డ్ వర్సిటీలు మారిపోతున్నాయన్నారు. ఈ పోటీని తట్టుకోవాలంటే మనం బాగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమంది తరగతులకు డుమ్మాకొట్టడం, పనిచేయకుండా తప్పించుకోవడానికి అలవాటు పడ్డారన్నారు. అనంతరం డెస్క్‌టాప్ ప్లానర్, క్యాలెండర్, టెలిఫోన్ బుక్ ఆవిష్కరించారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): క్రికెట్‌పై మోజుతో ఓ డిగ్రీ విద్యార్థి అదృశ్యమయ్యాడు. నగరంలోని నిర్మలానందనగర్‌కు చెందిన లక్ష్మయ్య కుమారుడు విష్ణువర్ధన్ స్థానిక ఎస్ఎస్‌బీఎన్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతడికి క్రికెట్ అంటే చాలా ఇష్టం. గతంలో విజయవాడకు వెళ్లి రెండు రోజులు ఉండి వచ్చాడు. ఈనెల 1వతేదీ ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. కొడుకు గురించి ఆరా తీసి ఆచూకీ లభించకపోవడంతో బుధవారం తండ్రి లక్ష్మయ్య త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి


మృతి చెందిన వెంకటచరణ్‌రెడ్డి

పెద్దపప్పూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట అటవీప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్ కిందపడి వెంకటచరణ్‌రెడ్డి (25) అనే యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి ఆయన కుమారుడు వెంకటచరణ్‌రెడ్డి ట్రాక్టర్‌లో బండల లోడుతో ధర్మవరం వెళుతున్నారు. ముచ్చుకోట అటవీ ప్రాంతం రాగానే స్పీడ్ బ్రేకర్ రావడంతో ట్రాక్టర్‌ను నడుపుతున్న లక్ష్మీరెడ్డి బ్రేక్ వేయడంతో ముందు భాగంలో కూర్చొన్న కుమారుడు వెంకటచరణ్‌రెడ్డి కిందపడిపోయాడు. ఈ సమయంలో ట్రాక్టర్ అతడిపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మోదీకి బ్రహ్మారథం


రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం


విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం


బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దబ్‌బిలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.


వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్


బహిరంగ సభకు హాజరైన అశేష జనం

అభివృద్ధికి సహకరించండి

- తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపడకండి
- జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇతర సభ్యులు
- రైతుల్లో చైతన్యం నింపండి : పుట్టపర్తి ఎమ్మెల్యే


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల, గ్రామ స్థాయిలో అధికారులు తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపటం సరి కాదని, జిల్లాలో జడ్పీటీసీలతో కలసి అభివృద్ధికి సహకరించాలని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరారు. బుధవారం జడ్పీలో స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ప్రధాన సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక, వర్క్స్ గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం స్టాండింగ్ కమిటీ సమావేశాలు, అదనపు సమావేశ మందిరంలో మహిళా సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. తొలిసారి స్టాండింగ్ కమిటీ సమావేశానికి అసిస్టెంట్ కలెక్టర్ వినూతన్న, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర హాజరయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొదట డీపీఓ, పంచాయతీ రాజ్, డ్వామా తదితర అంశాలపై చర్చ ప్రారంభించారు. పలువురు జడ్పీటీసీ సభ్యులు పెండింగ్ పనులను లేవనెత్తారు. జడ్పీటీసీ సభ్యులు భూతరాజు, శ్రీనివాసులు మాట్లాడుతూ... తాము తెచ్చిన పనులకు మండల, గ్రామ స్థాయిలో పంచాయతీ తీర్మానాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. దీనిపై జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. పదే పదే ఈ సమస్యను సభ్యులు సభ దృష్టికి తీసుకొసున్నారని, పరిష్కరించాలని సీఈఓను ఆదేశించారు. దీనికి సీఈఓ రామచంద్రారెడ్డి స్పందిస్తూ.... సత్యసాయి, అనంతపురం డీఈఓలు, అన్ని మండలాల ఎంపీడీఓలతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బుక్కరాయసముద్రం, కంబదూరు, కనగానపల్లి, విడపనకల్లు జడ్పీటీసీలు మాట్లాడుతూ...గతంలో ఇచ్చిన పనులు సిమెంట్, ఇసుక కొరత ఇతర కారణాల వల్ల ఆగిపోయాని, వాటిని రద్దు చేశారా..? లేక కొత్తగా మంజూరు చేస్తారా అని పంచాయతీ రాజ్ ఎస్ఈని అడిగారు. ఉపాధి హామీ పనులను జడ్పీటీసీలకు కేటాయించాలని కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ కలుగజేసుకుని గతంలోనే పెండింగ్ లిస్టు అడిగామని, ఎందుకు ఇవ్వలేదంటూ...ఎస్ఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో వ్యవసాయం స్టాండింగ్ కమిటీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరు మాట్లాడారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించే వ్యవసాయ పరికరాలు, డ్రిప్పు, స్రింక్లర్లు, విత్తనాలు, ఎరువులపై అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని అన్నారు. గత ఐదేళ్లలో రైతులకు ఎలాంటి పరికరాలు అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పుట్టపర్తి నియోజకవర్గంలో 3500 మంది రైతులకు డ్రిప్పు, స్రింక్లర్లు అందించామని గుర్తుచేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయమని తెలిపారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జడ్పీటీసీ సభ్యుడు చంద్ర హాస్టళ్లలోని సమస్యలపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

తాడిపత్రి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీ, టీచర్స్‌కాలనీల్లో బుధవారం తెల్లవారుజామున మూడిళ్లల్లో చోరీలు జరిగాయి. టైలర్స్‌కాలనీలో నివాసం ఉంటున్న చాంద్‌బీ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు చొరబడి రూ.15వేలు నగదుతోపాటు జత కమ్మలు చోరీ చేసినట్లు తెలిపారు. ఇదే కాలనీకి చెందిన అల్లాబకాష్ ఇంట్లో చోరీ జరిగినట్లు పేర్కొన్నారు. టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న నాగరాజురావు పది రోజులుగా బెంగళూరులో ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నించారు. కానీ ఇంట్లో నగదు, బంగారు లేకపోవడంతో వెనుదిరిగారు. అదేకాలనీలో ఉన్న వరప్రసాద్ ఇంటి వద్ద నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. ఈ బైక్‌ను ఆటోనగర్ సమీపంలో విడిచిపెట్టారు. పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను క్లూస్‌టీం ద్వారా పరిశీలించారు. ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చెట్టుపై నుంచి పడి కూలీ మృతి

బ్రహ్మసముద్రం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అజ్జయ్యదొడ్డి గ్రామానికి చెందిన పూజారి చిన్న రాజన్న (44) గత ఐదేళ్లుగా కూలీ పని చేసుకుంటూ బెంగళూరు జీవనం సాగించేవాడు. బుధవారం పనికి వెళ్లి చెట్లు నరుకుతుండగా కాలుజారి కిందపడ్డాడు. చెవి, ముక్కులో రక్తం ప్రవహించగా హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు యథాతథం: ఆర్ఐఓ

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షలు యథాతథంగా జరుగుతాయని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు ఉండవన్న ప్రచారం నేపథ్యంలో బుధవారం ఆర్ఐఓను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. దీనిపై ఆయన మాట్లాడుతూ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉండవంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోందన్నారు. ఇది వాస్తవం కాదన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇచ్చిన షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 2025-26 విద్యా ఏడాది నుంచి ఇంటర్ మొదటి ఏడాది పరీక్షల నిర్వహణపై బోర్డు ప్రజల అభిప్రాయం తీసుకుంటోందన్నారు. ఇంటర్ బోర్డు పోర్టల్ bie.ap.gov.inలో ప్రజల అభిప్రాయాలు చూడవచ్చున్నారు. ఈ జనవరి 26 నుంచి ఎవరైనా తమ అభిప్రాయాలు, సూచనలను biereforms@gmail.com అనే మెయిల్‌కు పంపవచ్చునన్నారు. అయితే దీనికి, ఈ ఏడాది ఫస్ట్ ఇయర్ పరీక్షలకు ఎలాంటి సంబంధం లేదని, ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఈ ఏడాది పరీక్షలుంటాయన్నారు. విద్యార్థులు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా పరీక్షలకు సిద్ధం కావాలని ఆర్ఐఓ సూచించారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఇద్దరి ఎంపిక

అనంతపురం విద్య, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు, మరో టీచర్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో సత్తా చాటారు. సౌత్ ఇండియా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. విజయవాడలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థి, టీచర్ ప్రతిభ చూపారు. విద్యార్థి గ్రూప్ విభాగం కణేకల్లు మండలం హనకనహాళ్ జడ్పీహైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు మహాలక్ష్మి, గీతారెడ్డి 'వృద్ధులకు పలు ప్రయోజనాలందించే ఊత కర్ర' ప్రాజెక్టు ప్రదర్శించారు. టీచర్స్ విభాగంలో ఉరవకొండ మండలం ఆమిద్యాల జడ్పీహైస్కూల్ ఫిజిక్స్ టీచర్ బండి శ్రీనివాసులు 'సరళమైన పద్ధతిలో ఒకే ప్రయోగం ద్వారా మూడు న్యూటన్ గమన సూత్రాలు' వివరిస్తూ...రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి. ఈ రెండు ప్రాజెక్టులు సౌత్‌ఇండియా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయి. దీంతో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ వెంకట క్రిష్ణారెడ్డి నుంచి ఆ విద్యార్థులు, టీచర్ రాష్ట్రస్థాయి అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో సత్తా చాటి....సౌత్ ఇండియా స్థాయికి ఎంపిక కావడంతో వారిని డీఈఓ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళీ కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.


హనకనహాళ్ విద్యార్థులు, టీచర్‌ను అభినందిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

సీనియారిటీ జాబితా విడుదల

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

వైద్యశాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

అనంతపురం టౌన్, జనవరి8(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఎఫ్ఎన్‌ఓ, వాచ్‌మెన్ పోస్టులను ఔట్‌సోర్సింగ్‌లో భర్తీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి బుధవారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 18 ఎఫ్ఎన్‌ఓ పోస్టులు, 11వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి భర్తీకి గురువారం నుంచి ఈనెల 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లా కార్యాలయం పనిదినాలలో ఉదయం 10-30గంటలనుంచి సాయంత్రం 5గంటలవరకు దరఖాస్తులను తీసుకుంటామన్నారు. ఈ పోస్టులకు సంబంధించిన వివరాలను జిల్లా వైద్యశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. ఆ వెబ్‌సైట్‌లోనే దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని భర్తీచేసిన తర్వాత సర్టిఫికెట్లు జతపరచి అందజేయాలన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తమపై దాడి చేశారని న గరంలోని కమలానగర్‌కు చెందిన ధర్మరామ్ అనే వ్యక్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమలానగర్‌లోని తమ మామ గోపాల్‌కు చెందిన ఎలక్ట్రిక్ షాపునకు ఈనెల 6వతేదీ బాబా అనే వ్యక్తి వచ్చి హెల్మెట్ కోసం గొడవపడ్డాడని ఫిర్యాదు చేశారు. అనంతరం 7వతేదీ బాబా, ఇర్ఫాన్, రఫీ కలిసి వచ్చి మరోసారి గొడవ పెట్టుకుని తనపై, తన తమ్ముడు దీపక్‌పై దాడి చేశారని, తన మామ గోపాల్ అ డ్డుకున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ ఘ టనపై వన్‌టౌన్ పోలీసులు కోర్టు ఆదేశా లు వచ్చిన తరువాతే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు ఫుడ్ సొసైటీ అధికారి రాక

గార్లదిన్నె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫుడ్ సొసైటీ అధికారి శేఖర్ బాబు గురువారం గార్లదిన్నెకు వస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి రత్నకుమార్ ప్రకటనలో తెలిపారు. చీనీ ఆధారిత పరిశ్రమ ఏర్పాటుపై రైతులతో అభిప్రాయ సేకరణకు ఆయన వస్తున్నట్లు తెలిపారు. గార్లదిన్నెలోని రైతు సేవాకేంద్రంలో మధ్యాహ్నం ఆయన రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి చీనీ రైతులు, ఎఫ్ఓలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

రేపు జాబ్‌మేళా

నార్పల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైన్‌టెక్ సర్వీసెస్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9010039901 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విరాళం


ఎమ్మెల్యేకి రూ.లక్ష విరాళం అందిస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి

రామగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పేరూరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పేరూరు ప్రాజెక్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు కురుబ లక్ష్మీ నారాయణ రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందించారు. మండలంలోని వెంకటాపురంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌కు ఆయన స్థానిక నాయకుల సమక్షంలో అందజేశారు. పేదల టీడీపీ సభ్యత్వ నమోదుకు వినియోగించాలని ఎమ్మెల్యే సూచించారు. లక్ష్మీనారాయణ రెడ్డిని అభినందించారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, మాజీ ఎంపీపీ పరంధామ యాదవ్, నాయకులు కోడి రామ్మూర్తి, పేపర్ శీన, అక్కులప్ప, అంజనేయులు పాల్గొన్నారు.

దళితుల శ్మశానాన్ని కాపాడండి

చెన్నేకొత్తపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బసంపల్లిలో దళితుల శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించారని, దీంతో దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే పూడ్చు కోవడానికి పోరాటం తప్పడం లేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలో కబ్జాకు గురైన దళితుల శ్మశాన స్థలాన్ని కాపాడాలంటూ ఆయన బుధవారం మండలంలోని బసంపల్లి దళితులతో కలిసి తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వేనెంబరు 17-1లో 1.30 ఎకరాల భూమిని శ్మశాన వాటిక కోసం గతంలో కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించుకుని మొక్కలు నాటారన్నారు. ఎవరైనా చనిపోతే పోలీసు రక్షణతో ఖననం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. బసంపల్లి దళితులు మల్లికార్జున, ఎర్రిస్వామి, రామకృష్ణ, నరసింహులు, మల్లేశ్, నాగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు విరాళం

నార్పల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 21న నిర్వహిస్తున్న గంగమ్మ దేవత జాతరకు టీడీపీ నాయకులు, శివకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి రూ.25వేలు విరాళం అందజేశారు. ఆయన బుధవారం ఆలయ కమి టీ సభ్యులకు ఆ విరాళం అందించారు. కార్యక్రమంలో ఆ ట్రస్ట్ ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, తిరుమల నాయుడు, నరేష్, ఆలయ కమిటీ సభ్యులు పాపన్న, పెద్దన్న, వెంకటయ్య, గంగాధర, నాగరాజు, మల్లికార్జున, నీలకంఠ, తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

రామగిరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శ్రీసత్యసాయి జిల్లా డీఎం అండ్‌హెచ్‌ఓ ఫిరోజాబేగం బుధవారం తనిఖీచేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. ఆస్పత్రిలో ఉన్న మందుల నిల్వలను ఆమె పరిశీలించి రోగులకు వైద్యసేవలు అందించడంపై అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాల ని, రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది తులసి, ఆంజనేయులు, శారదామణి, ఇంతియాజ్, సాయిలీల పాల్గొన్నారు.

పనులను వేగంగా చేయాలి: ఎంపీడీఓ

రాప్తాడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు హేమావతి, వైస్ ఎంపీపీ వరలక్ష్మి సర్పంచులు తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, ఎంపీటీసీలు జాఫర్, రవి, అధికారులు పాల్గొన్నారు.

మీ రక్షణ.. మీ చేతుల్లోనే..: సీడీపీఓ


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

నార్పల, జనవరి8(ఆంధ్రజ్యోతి): మీ రక్షణ మీచేతుల్లోనే ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ భారతి కిశోర బాలికలకు సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో బుధవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ నార్పల సీడీపీఓ భారతి, ఎంఈఓ కిష్టయ్య మాట్లాడుతూ... యుక్త వయసు బాలికల్లో మనోవికాసం, స్వీయరక్షణ, నైపుణ్యం, శక్తిసామర్థ్యాలు పెంపొందించే దిశగా జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. 'మీ రక్షణ మీచేతుల్లోనే ఉందన్నా'రు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మధుమాలిని, హేమలత, నాగమణి, కేజీబీవీ ఎస్‌ఓ నిర్మల, చైల్డ్ హెల్ప్‌లైన్ నిర్మల, సంధ్య పాల్గొన్నారు.

పట్టాలకే పరిమితం

- ఒక్క ఇల్లు మంజూరుకాని వైనం
- కంపచెట్లతో నిండిన జగనన్న కాలనీలు
- కూటమి ప్రభుత్వంపైనే లబ్ధిదారుల ఆశలు


శింగనమల జగనన్న లేఅవుట్‌లో పెరిగిన కంపచెట్లు

శింగనమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఏకంగా కాలనీలనే ఏర్పాటు కు పూనుకుంది. అయితే మండలంలో ఏ ఒక్కరికీ ఇల్లు మంజూరు చే య లేదు. అంతేకాకుండా ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు స్థలం మాత్రం మంజూరు చేయడం, అనువుగానిచోట స్థలాలు ఇవ్వడంతో చాలా మంది ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు. దీంతో మండలంలోని పేదల సొంతింటి కల అలాగే మిగిలిపోయింది. శింగనమల మండలంలోని 14 పంచాయతీల్లో గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు జగనన్న ఇంటి పట్టాలను 380 మందికి పంపిణీ చేశారు. శింగనమలలోని 110 మందికి, కల్లుమడి, తరిమెల పంచాయతీలకు కలిపి 100పైగా ఆయా జగనన్న లేఔట్లలో ఇంటి పట్టాలు ఇచ్చారు. అయితే మండలపరిధిలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు నిరాశపడ్డారు. తీరా ఎన్నికలు సమీపించే సరికి గత వైసీపీ ప్రభుత్వం ఆగమేఘాలపై లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కూడా చేశారు. కానీ ఆ స్థలాల్లో ఎక్కడ చూసినా కంపచెట్లు పెరగడంతో జగనన్న కాలనీలు ఆడవులను తలపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

గత వైసీపీ ప్రభుత్వం మండల వ్యాప్తంగా 380 పట్టాలు ఇచ్చినా, ఎక్కడా పునాది రాయి కూడా పడలేదు. దీంతో లబ్ధిదారులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం అయినా ఇళ్లు మంజూరు చేస్తుందనే ఆశతో ఉన్నారు.

కంపచెట్లు పెరిగాయి



గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. ఇళ్లు మంజూరవుతాయని ఐదేళ్లు ఎదురుచూశాం. అప్పట్లో మంజూరు చేయలేదు. కేవలం రిజిస్ట్రేషన్ పట్టా చేతిలో పెట్టి వదిలేశారు. ఈ ప్రభుత్వమైనా ఇళ్లు మంజూరు చేస్తే మేలు.

\- నాగేంద్ర, శింగనమల

ఇళ్లు మంజూరు చేస్తే నిర్మించుకుంటాం



మేము ముగ్గురు అన్నదమ్ములం. ప్రస్తుతం ఒకే ఇంట్లో ఉంటున్నాం. గత వైసీపీ ప్రభుత్వంలో ముగ్గురికీ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అయితే ఇళ్లు మంజూరు చేయలేదు. కనీసం కూటమి ప్రభుత్వం అయినా పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి. ప్రస్తుతం ఇరుకుగా ఉన్న ఇంట్లోనే మూడు కుటుంబాలు సర్దుకుపోతున్నాం.

\-వెంకటరమణ, శింగనమల

అర్హుల జాబితా పంపుతాం



మండలంలో అర్హత కలిగిన లబ్ధిదారులను నుంచి పట్టా, ఇతర డాక్యుమెంట్లు తీసుకుంటున్నాం. ఇళ్ల మంజూరుకు అర్హులైన వారి జాబి తా తయారు చేస్తున్నాం. ఇళ్ల మంజూరు కోసం త్వరలో ప్రభుత్వానికి జాబితా పంపుతాం.

\- నామాల శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ

పీఏబీఆర్ కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే


కాలువలో నీటి ప్రవాహం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోళ్లపల్లి సమీపంలో పీఏబీఆర్ కుడి కాలువలో నీటి ప్రవాహాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం పరిశీలించారు. అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడుతో కలిసి పర్యటించారు. కాలువలో నీటి మేర నీటి ప్రవాహం తగ్గిందనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్న తౌసీఫ్


కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి అవార్డు అందుకుంటున్న మహ్మద్‌తౌసీఫ్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్‌లో పనిచేస్తున్న జిల్లా వాసి మహ్మద్‌తౌసీఫ్ నేషనల్ ప్రధానమంత్రి ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన మంగళవారం ఢిల్లీలో జరిగిన బీహెచ్ఈఎల్ దినోత్సవంలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జిల్లా సహకార శాఖలో పనిచేస్తున్న మహ్మద్‌ఇక్బాల్ తనయుడు మహ్మద్ తౌసీఫ్ 2024 ఏడాదికి గాను బీహెచ్ఈఎల్ నేషనల్ ప్రధానమంత్రి ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల జర్మనీ పర్యటన చేసిన తౌసీఫ్ ట్రైన్ ప్రమాదాల నివారణకు ఉపయోగించే ఇంజిన్ ట్రాక్షన్‌పై ప్రత్యేకంగా అధ్యయనం చేసివచ్చారు. దేశంలోని రైల్వేలో ప్రమాద రహిత ట్రైన్ తయారీకి ప్రవేశపెడుతున్న అత్యాధునిక సాంకేతికతను అందజేయడంలో తౌసీఫ్ బీహెచ్ఈఎల్‌లో కీలకంగా పనిచేస్తున్నారు.

అనంతలక్ష్మి కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్, జిల్లా వైద్యశాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తా ద్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని అనంతలక్ష్మి కళాశాల వైస్ చైర్మన్ రమేష్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులను సమాజసేవలో భాగస్వాములను చేయడానికి రక్తదాన శిబిరాలు, క్లీన్ అండ్ గ్రీన్ వంటి కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. రక్తదానం చేయడంవల్ల ప్రాణప్రాయ బాధితులకు తిరిగి ప్రాణంపోసిన వారు అవుతారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేష్‌నాయుడు, ఎన్ఎస్ఎస్ పీఓలు ఖలీల్, నవీన్, మెడికల్ ఆఫీసర్ శంకర్‌గౌడ్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

- దివ్యాంగులు, పారా క్రీడాకారుల వినతి


ఏడీకి శుభాకాంక్షలు తెలుపుతున్న విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్‌ను ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. నూతన ఏడీగా బాధ్యతలు స్వీకరించిన వినోద్‌ను బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే ఆంజినేయులు, ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, మైనార్టీ నాయకులు రసూల్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే క్రమంలో ఉమ్మడి జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసేలా చొరవ చూపాలన్నారు. దివ్యాంగులకు అందే సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు, కార్యదర్శి మనోహర్, నాగరాజు, ధనుంజయ ప్రసాద్, శేఖర్, రాజేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రస్తా ఇప్పించి.. న్యాయం చేయండి

- సర్వే విభాగం ఏడీకి రైతుల విన్నపం


రైతులతో కలిసి రస్తాను పరిశీలిస్తున్న సర్వేయర్ ఏడీ రూప్లానాయక్

గార్లదిన్నె, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లేందుకు అవసరమైన రస్తా కల్పించి న్యాయం చేయాలని పలువురు రైతులు సర్వే విభాగం ఏడీ రూప్లానాయక్‌కు విన్నవించారు. మండల పరిధిలో ని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరిరక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)కు సంబంధించి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఆ నిర్మాణం పక్కనే గార్లదిన్నె, శింగనమల మండలాలకు చెందిన జంబులదిన్నె, కొట్టాల, ఆకులేడు, లోలూరు, రఘునాథ్‌పురం గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు 150 ఎకరాలకుపైగా పొలాలకు వెళ్లేందుకు రస్తా ఉంది. ట్రాక్టర్ నగర్‌కు ప్రహరీ నిర్మిస్తుం డడంతో ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు వెళ్లేందుకు దారి లేకుండా పోతోందని రైతులు వాపోతు న్నారు. విషయం తెలుసుకున్న సర్వేయర్ ఏడీ రూప్లానాయక్ రస్తాను పరిశీలించారు. సంబంధిత రైతులు తమ గోడును ఆయనతో మొరపెట్టుకున్నారు. అధికారులు స్పందించి పంట పొలాలకు వెళ్లేందుకు అవసరమైన 15 అడుగుల రస్తా వదిలి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఏడీ రూప్లానాయక్ శింగనమల రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. రైతు లకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంక్రాంతి కానుకపై రేపు ధర్నా: సీపీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్రాంతి కానుకను ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అందజేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యా లయం వద్ద శుక్రవారం చేపట్టే ధర్నాను విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. చాలా రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులను సరిగా అందించడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారంతోపాటు సంక్రాంతి కానుక కోసం ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.

శనీశ్వరుడి విగ్రహం ధ్వంసం

హిందూపురం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోతుకపల్లి వద్ద శని దేవస్థానానికి వెళ్లే రహదారిలో ఆర్చి వద్ద ఉన్న శనిదేవుడి విగ్రహం కుడి చేతిని గుర్తుతెలియని దుండగులు మంగళవారం రాత్రి విరగకొట్టారు. బుధవారం ఉదయం అటుగా వెళ్లేవారు గమనించి ఆలయ అర్చకుడికి విషయం తెలియజేశారు. అనంతరం గ్రామస్తులు అక్కడకు చేరుకొని రోడ్డుపై బైఠాయించి నిరసన చేయాలని గుమిగూడారు. ఇంతలో విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడు అక్కడకు చేరుకొని వారిని శాంతింపచేశారు. స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి దుండగులను పట్టుకుంటానన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం

- కరెంటు లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం


చిన్నకాలువ వీధిలో ఒరిగిన కరెంటు స్తంభం

శింగనమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ విద్యుత్ స్తంభానికి బల్బు అమరుస్తుండగా... ఉన్నట్టుండి ఆ స్తంభం ఓ పక్కకు ఒరిగిపోయిం. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. శింగనమల చిన్నకాలువ వీధిలో బుధవారం సాయం త్రం విద్యుత్ స్తంభాలకు బల్బులు అమరుస్తున్నారు. విద్యుత్ శాఖకు చెందిన కార్మికుడు ఓ ఇనుప కరెంట్ స్తంభంపైకి ఎక్కి విద్యుత్ లైట్ ఏర్పాటు చేస్తుండగా ఉన్నట్టుండి ఆ స్తంభం పక్కకు ఒరిగిపోయింది. దీంతో విద్యుత్ కార్మికుడు కింద పడి స్వల్ప గాయలతో బయటపడ్డారు. స్తంభానికి ఉన్న కరెంట్ తీగలు దారిపై పడ్డాయి. వాటిని అటుగా వెళుతున్న చాలా మంది మహిళలు తొక్కారు. అయితే విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. గ్రామంలో చాలా ఏళ్ల కిందట ఇనుప కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ స్తంభాల అడుగుభాగాలు ప్రస్తుతం తుప్పుపట్టి చా లా ప్రమాదకరంగా ఉన్నా యి. అవి ఎప్పుడు ఒరిగి పోతాయో తెలియని పరి స్థితిలో ఉన్నాయి. ఇప్పటి కైనా విద్యుత్ శాఖ అధి కారులు పాత ఇనుప కరెంట్ స్తంభాలను తీసి వేసి, వాటి స్థానంలో నూ తనంగా సిమెంట్ స్తం భాలను ఏర్పాటు చేయా లని శింగనమల గ్రా మస్థులు కోరుతున్నారు.

కూటమితోనే విద్యా రంగం అభివృద్ధి

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే విద్యా రంగం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. దయనీయ పరిస్థితుల్లో ఉన్న హాస్టళ్లకు కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేసిన విషయం విదితమే. అందులో భాగంగానే నగరంలోని మరమ్మతులు చేపట్టిన గిల్డాఫ్ సర్వీస్ స్కూల్ పక్కనున్న ఎస్సీ నెం2 ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాలికల వసతిగృహాలను బుధవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్య అతిథులు గా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కంకణబద్ధులై ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 501 పా ఠశాలల్లో రూ. 1.15 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, ఎస్సీ సంక్షేమశాఖ డీడీ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, డీఈఓ రమణారెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ దామోదర్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ సూపరింటెండెంట్ రాజేష్, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, వార్డెన్లు అనిత, వసంత, మాధవి, నాగార్జున రెడ్డితో పాటు వసతి గృహాల విద్యార్థినులు పాల్గొన్నారు.

కశ్మీర్ ఉత్సవ్ మేళా ప్రారంభం


మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : గుత్తి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కశ్మీర్ ఉత్సవ మేళాను బుధవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనంత పురం ప్రజలు సాయంత్రం సమయంలో సంతోషంగా గడిపేందుకు ఇలాంటి వేదికలు అవసరమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రఘుప్రసాద్ మాట్లాడుతూ.. కశ్మీర్ ఉత్సవ మేళా అనంత ప్రజలను సంతోషపరిచే విధంగా ఉంటుందన్నారు. అనేక రకాల ఆట వస్తువులు, తినుబండారాలు ఉంటాయన్నారు. ప్రత్యేకంగా మినీ కశ్మీర్‌ను పరిచయం చేస్తూ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుంచెపు వెంకటేష్, సరిపూటి రమణ, ఇస్మాయిల్, చరిత, నాగరాజు, రాంబాబు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజేష్, షాహిద్, చందు, శ్రీకాంత్, జానీ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- టీఎన్‌ఏటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు


సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్‌ఏటీయూ రాష్ట్ర నేతలు

చెన్నేకొత్తపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ (టీఎన్‌ఏటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం అనంతలక్ష్మి, కె.లక్ష్మీనరసమ్మ పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంగన్‌వాడీల సమస్యలను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వానికి అంగన్‌వాడీలకు మధ్య వారధిగా పని చేస్తామన్నారు. అనంత రం అంగన్‌వాడీల సమస్యలపై సీడీపీఓ కవితాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షురాలు దళవాయి రమాదేవి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ వీణ, జిల్లా అడహక్ కమిటి సభ్యులు జమున, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మెడికల్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మహిళా మెడికోలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. మెడికోలు పోటా పోటీగా సంక్రాంతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. అనంత రం ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప


వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి, రైతులకు పంటనష్ట పరిహా రం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. మన్నీల గ్రామానికి వచ్చిన కేంద్ర కరువు పరిశీలన బృందాన్ని బుధవారం సీపీఎం జిల్లా కమిటీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా నల్లప్ప మాట్లాడుతూ... జిల్లాలో గతేడాది అతివృష్టి, అనావృష్టి వల్ల అన్నిరకాల పంటలు దెబ్బతిన్నాయన్నారు. అత్యధికమంది రైతులు పరిమిత నీటి వనరులతో, సొంత ఖర్చులతో డ్రిప్, స్ప్రింక్లర్లపై ఆధారపడి సాగు చేస్తున్నారన్నారు. దీనివల్ల రైతుల అప్పులు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు రాక జిల్లాలోని మూడలక్షల ఎకరాలను బీడుగా పెట్టారన్నారు. కావున జిల్లాలోని 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటనష్ట పరిహారం, వ్యవసాయ కూలీలకు 200 రోజులు పనిదినాలు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామాంజినేయులు, రైతుసంఘం నాయకులు పోతులయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మీడియాపై ఓ అధికారి చిందులు

● నివ్వెర పోయిన ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

పుట్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఓ అధికారి మీడియాపై చిందులు వేశారు. ఆయన పట్ల అవినీతి ఆరోపణలపై ఓ పత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఆగ్రహించినట్లు తెలుస్తోంది. రాసుకుంటే రాసుకోండి.. ఏం చేస్తారు అంటూ అసభ్య పదజాలంతో దుయ్యబట్టారు. విలేకరులంతా కలిసి రాసినా ఏమీ చేసుకోలేరని సదరు టీడీపీ నాయకుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి ఆరోపణలు వస్తే నిరూపించుకోవాల్సిన ఆ అధికారి రాజకీయ నాయకుల ఎదుట అసభ్యపదజాలంతో దూషించడంతో అక్కడున్న సిబ్బంది నివ్వెరపోయారు. మహిళా ఉద్యోగులు ఉన్నారన్న విషయం కూడా మర్చిపోయిన ఆ అధికారి అసభ్యపదజాలం వాడారు. దీంతో మహిళా ఉద్యోగులు కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ విషయంపై ఎంపీడీఓ అలివేలమ్మను వివరణ కోరగా ఆ విషయం తన దృష్టికి వచ్చిందని, ఆయన్ను పిలిపించి మాట్లాడి మందలిస్తామని తెలిపారు.

వికలాంగులకు దుప్పట్ల పంపిణీ

తాడిపత్రి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులతిప్పాయపల్లి జీవనాలయంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 52మంది వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు వెంకట సుబ్రమణ్యం తెలిపారు. సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు: బీజేపీ

గుంతకల్లుటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం వారు సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే లక్ష్యంగా ప్రధాని మోదీ బుధవారం రూ.2లక్షల కోట్ల నిధులతో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్, నాయకుడు వాసం రవిబాబు పాల్గొన్నారు.

గాలిమరల కార్మికుల నిరసన

పుట్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లుట్ల గ్రామశివారులో ఉన్న గాలిమరల సబ్‌స్టేషన్ వద్ద బుధవారం కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమకు చెల్లించే రూ.10వేల జీతం లో యాజమాన్యం రూ.2500 కట్ చేశారని వాపోయారు. ఎందుకు కట్‌చేశారో సరైన సమాధానం చెప్పలేదన్నారు. పండుగపూట కట్ చేయడం దారుణమన్నారు. నిరసనలో 9మంది కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం అపహరణపై కేసు నమోదు

యాడికి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఒక వ్యాపారికి చెందిన ధాన్యం గోడౌన్‌లో 10బస్తాల జొన్నలు చోరీకి గురవడంపై బుధవారం కేసు నమోదుచేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. నాగేంద్రప్రసాద్ అనే వ్యాపారి రైతుల నుంచి జొన్నలు, సజ్జలు కొనుగోలు చేసి గోడౌన్‌లో నిల్వ చేస్తుంటాడని, అయితే మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గోడౌన్ తాళాలు పగలగొట్టి 10బస్తాల జొన్న లు ఎత్తుకెళ్లారని అన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రేపు జాబ్ మేళా

రాయదుర్గం రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పుషస్ ఫైనాన్స్ లిమిటెడ్, అమెజాన్, హుండయ్, మోబీస్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. 230 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గంలో ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమో చదివిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు విద్యార్హత సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకి కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్

కూడేరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, బాల్య వివాహాలు చేసి బాలికల భవిష్యత్తును నాశనం చేయరాదని సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు, బాల్య వివాహాలపై సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహలు చేయడం వల్ల బాలికలకు ఆరోగ్య సమస్యలు, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. దీంతో వారి భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. కనుక ఎవరూ బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, ఏసీడీపీఓ యల్లమ్మ, ఎంఈఓ మహమ్మద్‌గౌస్, సర్పంచు లలితమ్మ, వివిధ శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు ఊరట

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

● 16మంది లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాన్ని అందిస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్)తో నిరుపేదలకు ఎంతో ఊరట కలుగుతోందని, అనారోగ్యంతో సతమతమవుతూ వైద్యం చేయించుకోవటానికి ఇబ్బంది పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఆర్థిక చేయూత కలుగుతోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 16 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి సుమారు రూ. 22,75,609 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను, ఎల్ఓసీలను పట్టణంలోని తన నివాసంలో బుధవారం కాలవ శ్రీనివాసులు లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రులలో వైద్యం చేయించుకుంటున్న నిరుపేదలకు ఈ సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఊరట కలిగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరయ్యే ఆర్థిక సాయం పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ప్రతిఒక్కరూ ఈ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెక్కులు అందుకున్న వారు ముఖ్యమంత్రికి, విప్ కాలవకు కృతజ్ఞతలు తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

రాయదుర్గం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి రాయదుర్గానికి మంచిపేరు తేవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బుధవారం విజేతలకు బహుమతుల ప్రదానం చేపట్టారు. కార్యక్రమానికి కాలవ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు విద్యార్థులను కేవలం విద్యకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. క్రీడలు దినచర్యలో ఓ భాగం అయ్యేలా ప్రతి విద్యార్థి ప్రయత్నించాలన్నారు. ఆత్మవిశ్వాసం పెంచుకుంటే మెరుగైన ఫలితాలు సాధించటానికి వీలుంటుందన్నారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతర ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. పలు పాఠశాలల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రైవేట్ స్కూల్‌యాజమాన్యాల సంఘం సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి



చిన్నయక్కలూరులో ఇంటి పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపప్పూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నయక్కలూరు, తురకపల్లి, కొండాపురం గ్రామాల్లో బుధవారం ఆయన గ్రామసభలు నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రధానంగా సాగు, తాగునీటి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే అనేక అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. తర్వాత గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చిన్నయక్కలూరులో పలువురి గ్రామస్థులకు ఇంటిపట్టాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శకుంతల, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథరెడ్డి, మాజీ ఎంపీపీ బీసీ రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ గుర్తి రఘునాయుడు, నాయకులు శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కూచి సాయిమోహన్, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

● గరుగుచింతలపల్లి చెరువుకు నీటి విడుదల



కోమటికుంట్ల చెరువు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీని మాట తప్పకుండా నెరవేర్చామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కోమటికుంట్ల చెరువు నుంచి గరుగుచింతలపల్లి చెరువుకు బుధవారం హెచ్చెల్సీ నీటిని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులను నింపుతున్నామన్నారు. చెరువులు నిండుతుంటే రైతులు కళ్లల్లో ఆనందానికి హద్దులు లేవన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఆఖరి చెరువు వరకు నీటిని విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నీటి విడుదలతో రైతులంతా ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు కులశేఖర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, జయుడు, రాజేష్‌నాయుడు, విజయ్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రాజు, వేణు, జయరామిరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు భూమిపూజ

యల్లనూరు: మండలకేంద్రంలోని పాతపేటలో గల బీసీ కాలనీలో రూ.13లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సర్పంచు పెద్ద ఓబులమ్మతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. అలాగు అక్కడ రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో రోడ్లకు నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలో రూ.1.90కోట్ల నిధులను సీసీరోడ్లకు మంజూరు చేయించి 80శాతం పనులు పూర్తిచేశామని తెలిపారు. అనంతరం బీసీ హాస్టల్‌ను పరిశీలించి అక్కడ విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు.

ఏఐవైఎఫ్ సభ్యుల ఎన్నిక

రాయదుర్గం రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చిందనూరు కళ్యాణమండపంలో బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నూతన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొట్రేష్, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులుగా శామ్యూల్, దేవేంద్ర, కుళ్లాయస్వామి, సహాయ కార్యదర్శులుగా మోహనకృష్ణ, వంశీకృష్ణ, ధనుంజయ, కోశాధికారిగా శ్రీనివాస్‌తో పాటు 23 మంది కార్యవర్గ సభ్యులను, 53 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. తర్వాత ఆ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 6, 7న శ్రీకాకుళం జిల్లాలో జరిగే 22వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర మహాసభల లోగోని విడుదల చేశారు.

దివ్యాంగుల పింఛన్లపై విచారణ

బెళుగుప్ప, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలవ్యాప్తంగా దివ్యాంగుల పింఛన్లపై స్థానిక వైద్యాధికారి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కర్నూలు జిల్లా వైద్యాధికారులు ప్రణీత్ కుమార్, గోపీచంద్, అమర్‌నాథ్, రామయ్య బృందాలుగా ఏర్పడి విచారణ జరిపారు. గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు.

కసాపురం ఆలయ భూముల పరిశీలన

గుంతకల్లుటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూములను ఆలయ కార్యనిర్వహణాధికారి కే. వాణి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో దేవాలయానికి చెందిన భూములను కౌలుకు ఇచ్చామన్నారు. చిప్పగిరి మండలం ఖాజీపురంలో 11.96 ఎకరాలు, కుందనకుర్తిలో 24.10 ఎకరాలు, బెల్డొణలో 2.97 ఎకరాలు, ఆలూరు మండలం మొలగవల్లిలో 50.52 ఎకరాలు, నంచర్ల గ్రామంలో 12.08 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూములను కౌలురైతులతో కలిసి పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఓంకారం, పర్యవేక్షకుడు వెంకటేశులు, పాల్గొన్నారు.

రూ.25 వేల జరిమానా

ఆంధ్రజ్యోతి స్పందన

విడపనకల్లు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి వీ కొత్తకోట గ్రామంలో ఇటీవల రైతుల నుంచి కందులు కొనుగోలు చేశాడు. కాగా తూకాల్లో మోసాన్ని గ్రహించిన రైతులు ఆ వ్యాపారిని నిలదీసి జరిమానా వసూలు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో బుధవారం తూకాల్లో మోసం.. పసిగట్టిన రైతులు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన తూనికలు, కొలతల అధికారులు వెంటనే విడపనకల్లుకు చేరుకుని ఆ వ్యాపారి ఇంట్లో సోదాలు చేశారు. రెండు రోజుల క్రితం వీ కొత్తకోటలో కందులను తూకం వేసిన ఎలక్ట్రికల్ కాటాను మార్చి పాత కాటాను ఉంచటంపై అధికారి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త కాటా ఎక్కడికి వెళ్లిందని, దాన్ని తీసుకురావాలని తెలిపారు. ఎలక్ట్రికల్ కాటాలో విద్యుత్ వైర్లు కట్ అయినా దానిని ఎలా వాడుతారని ప్రశ్నించారు. కొత్త కాటా ఎక్కడ ఉందో.. తీసుకురావాలని, లేదంటే చర్యలు తప్పవని అన్నారు. అనంతరం కందుల వ్యాపారికి రూ. 25వేలు జరిమానా విధించారు. అలాగే రెండు బేకరీలకు ఒక్కొక్క దానికి రూ. 10వేలు చొప్పున జరిమానా విధించారు. మండలంలోని ఏ వ్యాపారి అయినా తూనికలు కొలతల్లో మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మూడోరోజూ .. క్రికెట్ టోర్నీ

తాడిపత్రి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న జేసీ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం మూడవరోజూ కొనసాగింది. పోటీలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తిలకించారు. ఈ రోజు జరిగిన మ్యాచ్‌ల్లో పీపీడీ లెవెన్, ముచ్చుకోట కింగ్స్ జట్లు పోటీపడగా పీపీడీ జట్టు 82పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముచ్చుకోట జట్టు 51పరుగులతో పరాజయం పాలైంది. రెండో మ్యాచ్ విష్ణులెవన్ , చిక్కేపల్లి యూత్ జట్ల మధ్య జరిగింది. ఇందులో విష్ణు జట్టు 95పరుగులు సాధించింది. చిక్కేపల్లి జట్టు 43పరుగుల తేడాతో ఓటమిపాలైంది. చివరి మ్యాచ్‌లో లియో యాడికి , గంగమ్మ వారియర్స్ జట్లు పోటీపడ్డాయి. లియో యాడికి జట్టు 111పరుగులు సాధించింది. గంగమ్మవారియర్స్ జట్టు 47పరుగులు సాధించి ఓటమి చవిచూసిందని నిర్వాహకులు విజ్జి, సుధీర్‌రెడ్డి, కందన్‌లు తెలిపారు.

10 వరకు లైఫ్ సర్టిఫికెట్ల జారీ

తాడిపత్రి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఈనెల 10వ తేదీ వరకు ప్రభుత్వ పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్లను జారీ చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 10వరకు మాత్రమే సర్టిఫికెట్లను ఇస్తామన్నారు. పండుగ అనంతరం ఈనెల 16వ తేదీ నుంచి తిరిగి సర్టిఫికెట్లను ఇవ్వనున్నట్లు చెప్పారు. పెన్షనర్లు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ కొత్తపల్లి గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. తొండపాడుకు చెందిన మధు, రంగప్ప బైక్‌లో గుత్తి నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. కాగా కొత్తపల్లి సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న రమేష్ అనే వ్యక్తిని ఢీకొట్టారు. ప్రమాదంలో రమేష్‌తో పాటు బైక్‌పై ఉన్న ఆ ఇద్దరూ కూడా కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సమయపాలన పాటించాలి

ఉరవకొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్లు, సహాయకులు సమయపాలన పాటించాలని సీడీపీవో శ్రీదేవి సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, సిబ్బందితో బుధవారం ఆమె రివ్యూ నిర్వహించారు. బాల్యవివాహలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పోషణ్ కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల్లో పండ్లు, ఆకుకూరల తోటల పెంపకం చేసి వాటిని, గర్భిణిలు, బాలింతలకు అందజేయాలన్నారు. అడిషనల్ సీడీపీవో ఎల్లమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యానిమేటర్ తొలగింపు

విడపనకల్లు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని యానిమేటర్ మమతను విధుల నుంచి తొలగించినట్లు ఏపీఎం కాశానాయక్ తెలిపారు. వెలుగు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మమత మండలకేంద్రంలో చార్మినార్ మహిళా సంఘంలో లత అనే మహిళ పేరును ఫోర్జరీ సంతకం చేసి రూ. 1.5లక్ష డ్రా చేసిందని తెలిపారు. దీంతో లత ఫిర్యాదు మేరకు విచారించి నివేదికను జిల్లా అధికారులకు పంపామన్నారు. జిల్లా అధికారులు స్పందించి మమతను విధుల నుంచి తొలగించినట్లు బుధవారం ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇక మీదట మమత మండల కేంద్రంలో ఏ మహిళా సంఘం వద్దకు వెళ్లినా, మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయిస్తానని తెలిపినా చట్టపరమై చర్యలు తీసుకంటామని తెలిపారు.

రీ సర్వేపై అవగాహన

బెళుగుప్ప, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తగ్గుపర్తిలో బుధవారం భూముల రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షర్మిల మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి సర్వే నిర్వహిస్తామని, రైతులు తమ భూములకు సంబంధించిన హక్కు పత్రాలతో సర్వేకు హాజరై సజావుగా జరిగేలా సహకరించాలని సూచించారు. తర్వాత సర్వే ప్రాధాన్యత గురించి రైతులకు అవగాహన కల్పించి గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, డీటీ సురేఖ, వీఆర్వో వెన్నెల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

యాడికి, జనవరి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 10మంది విద్యార్థులకు ఎస్‌బీఐ తరఫున ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమేషబాబు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల్లో విద్యను ప్రోత్సహించడం కోసం వి సైకిళ్లను పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు రుణాలను కూడా అందిస్తామన్నారు. హెచ్‌ఆర్ మేనేజర్ క్రిష్ణ, రాయలచెరువు బ్రాంచ్ మేనేజర్ సూర్యశివప్రసాద్, హెచ్‌ఎం గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

శాంతి సద్భావన రథయాత్ర పోస్టర్ల విడుదల

యాడికి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంత్ శ్రీసేవాలాల్ జయంతి సందర్భంగా ఈ నెల 26వ తేదీన అనంతపురంలో బంజారా భవన్ నుంచి నాయక్‌నగర్‌లోని మారెమ్మగుడి వరకు నిర్వహించే శాంతి సద్భావన రథయాత్రలో బంజారాలు పాల్గొని విజయంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రథయాత్రకు సంబంధించిన పోస్టర్లను బుధవారం మండలంలోని పుప్పాల తండాలో విడుదల చేశారు. కార్యక్రమంలో జయరామనాయక్, రామాంజనేయులు నాయక్, బాబునాయక్, మత్రునాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

గుత్తి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని పెద్దవడూగురు సీఐ రామసుబ్బయ్య సూచించారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత ర్యాగింగ్ చేయడం, డ్రగ్స్ తీసుకోవడం లాంటివి చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. వీటి వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ప్రొఫెసర్ నరసింహులు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

బాలికలకు ఆరోగ్యంపై అవగాహన

కుందుర్పి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు బుధవారం సమాజక్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరోగ్యం, ఆహారంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనూష హాజరై మాట్లాడారు. ఎదుగుతున్న దశలో వచ్చే ఆరోగ్య సమస్యలపై బాలికలు ఆందోళన చెందకుండా అవగాహన పెంచుకోవాలని, సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సరైన మోతాదులో పాలు, గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు లాంటి ఆహారాన్ని తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ఎస్కే ఛారిటబుల్ ట్రస్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్, కేజీబీవీ ఎస్‌వో నిర్మల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణతరగతులు

బొమ్మనహాళ్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కిశోరి వికాసంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో కణేకల్లు ఐడీసీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మిప్రసన్న, ఎస్‌ఐ నబీరసూల్, ఎంపీడీఓ దాసనాయక్, ఈఓపీఆర్డీ దాస్ పాల్గొని మాట్లాడారు. యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం ఎంతో దోహదపడుతుందన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ఎంఈఓ వీరన్న, వైద్యాధికారి మల్లేశ్వరి, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

గుంతకల్లుటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే రక్షణ కల్పించాలని సీపీఐ అనుబంధ సంఘమైన ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పావని ప్రసాద్, పద్మావతి కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం వారు సమావేశంలో మాట్లాడారు. కార్యాలయాల్లో మహిళా ఉద్యోగినులపై కూడా అధికారుల వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. వీటిని అరికట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. నాయకురాళ్లు లక్ష్మి, శివమ్మ, మమత, పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు



విద్యుద్దీపాలంకరణలో చింతలరాయుడి ఆలయం

తాడిపత్రి, జనవరి8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ వైష్ణవ ఆలయమైన చింతల వెంకటరమణస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన జరగనున్న వైకుంఠ ఏకాదశి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బుధవారం పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ.. ఆలయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మునుపెన్నడూ లేని రీతిలో ఈసారి వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, ఆలయకమిటీ సభ్యులు చంద్రశేఖర్, శేషఫణి, దామోదర్, ఈఓ నరసయ్య తదితరులు ఉన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మున్సిపల్ ఉద్యోగులు బుధవారం నిరసన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌పై స్థానిక వైసీపీ నాయకుడు బిక్కి హరి దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి పాల్పడ్డారని మండిపడుతూ.. మున్సిపల్ కార్యాలయం నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ఉన్నత అధికారి పైనే వైసీపీ నాయకుడు దురుసుగా ప్రర్తిస్తూ దాడులకు పాల్పడడం హేయమైన చర్యని అన్నారు. తర్వాత వారు పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ యువరాజుకు వైసీపీ నాయకుడు బిక్కి హరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

బిక్కి హరి అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు బిక్కి హరిని పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ విధులలో ఉన్న సమయంలో బిక్కి హరి దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. అతడిని కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కాలేజీల్లో ముందస్తు సంక్రాంతి



గుంతకల్లులోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో భోగి మంటలు

తాడిపత్రి/ గుంతకల్లు టౌన్/ ఉరవకొండ జనవరి 8(ఆంధ్రజ్యోతి): ముందస్తుగా సంక్రాంతి సంబరాలను పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థినులు చక్కని రంగవల్లులు వేసి బహుతులు గెలుపొందారు. అనంతరం ప్రిన్సిపాల్ సంక్రాంతి విశిష్టతను వివరించారు. అధ్యాపకులు విజయభాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మండలంలోని తలారిచెరువు గ్రామసమీపంలో ఉన్న అదాని సిమెంట్ పరిశ్రమలోనూ సంక్రాంతి సంబరాలను జరిపారు. ఈ సందర్భంగా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతికి మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్లాంట్ చీఫ్ మేనేజర్ క్రిష్ణయ్యయాదవ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుంతకల్లు పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థినులు రకరకాల ముగ్గులు వేసిగొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. అలాగే భోగి మంటలు వేశారు. తర్వాత ఉట్టి కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, కళాశాల చైర్మన్ డీఏ మురళీకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్ఎ స్, మహిళా సాధికారత ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటరాముడు, అధ్యాపకులు పాల్గొన్నారు.